

కదన'బరి..కోట్లే గురి'

గుడుపల్లె మండలంలో బోయనపల్లెలో శనివారం రూ.కోట్ల ఆర్జనే ధ్యేయంగా జల్లికట్టు జరగనుంది. - 8లో



అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

చిత్తూరు రైల్వేస్టేషన్‌లో మహారాష్ట్రకు చెందిన అంతర్రాష్ట్ర దొంగ ప్రకాష్‌ను అరెస్టు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. - 8లో



ఆక్రమణల తొలగింపు

పుంగనూరు బస్టాండ్ వద్ద కౌండిన్య కాలువలో ఆక్రమణలను అధికారులు శుక్రవారం తొలగించారు. - 8లో

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు



అభిషేక పూజలకు తరలివచ్చిన భక్తులు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి రాహుకాల సమయం 10.30 నుంచి 12 గంటల మధ్య అభిషేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయకర్తలకు ఈఓ తీర్థప్రసాదాలను అందజేశారు.

23న గంటా కమలమ్మ సాహితీ పురస్కారం

చిత్తూరు కలెక్టరేట్ : గంటా కమలమ్మ సాహితీ పురస్కారం ప్రదాన కార్యక్రమం ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్నట్లు శ్రీమతి గంటా కమలమ్మ సాహితీ పురస్కార ట్రస్టు నిర్వాహకులు గంటా మోహన్, గంటా రాజా, గంటా రాజేంద్ర తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని మిట్టూరులోని విజయం డిగ్రీ కళాశాల సమావేశమందిరంలో ఈ నెల 23వ తేదీన ఉదయం 9 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. గంటా కమలమ్మ స్మారక కవితా పురస్కారం - 2024 కు నిర్వహించిన పోటీకి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 35 కవితా సంపుటాలు అందాయన్నారు. న్యాయనిర్ణేతలుగా ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ రాధేయ (అనంతపురం), డాక్టర్ రఘు (హైదరాబాద్) వ్యవహరించారని వెల్లడించారు. పురస్కారానికి 'నాలుగు రెక్కల పిట్ట (సాంబమూర్తి లండ, శ్రీకాకుళం), చింతల తొవ్వ' (తుల శ్రీనివాస్, నల్గొండ, తెలంగాణరాష్ట్రం) ఎంపికయ్యారన్నారు. పురస్కార గ్రహీతలను రూ.10 వేల నగదు, జ్ఞాపికతో సత్కరించనున్నట్లు వారు తెలిపారు.

బతుకు చింత



కట్టి చింతకాయ బస్తాలను లారీకి లోడ్ చేస్తున్న కూలీలు.(ఇన్‌సెట్) బిస్కెట్లుగా తయారు చేసిన చింతపండు

దక్కని గిట్టుబాటు..ఆగిన ఎగుమతులు.. కోల్డ్‌స్టోరేజీల్లో పేరుకున్న నిల్వలు.. తగ్గుతున్న నాణ్యత.. ముంచుకొస్తున్న సీజన్.. వెరసి.. చింతపండు పరిశ్రమ కునారిల్లుతోంది. ఫలితం.. గోడౌన్ల అద్దె చెల్లించలేక, వడ్డీలు కట్టలేక, రుణం తీర్చలేక వ్యాపారులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు.. కూలీలు, రైతులకు బతుకు చింత అయ్యింది. ధరలు లేకపోవడంతో కుదేలైన చింతపండు పరిశ్రమపై కథనం.

- ధరలు, ఎగుమతులు లేవు
- ఏడాదిగా కోల్డ్‌స్టోరేజ్‌లో మగ్గుతున్న చింత పండు
- 15 వేల మందికి ఉపాధి కరువు

పుంగనూరు: రాష్ట్రంలో పుంగనూరు చింత పండుకు ప్రసిద్ధి. సుమారు శతాబ్దం కాలంగా పుంగనూరు నియోజకవర్గంలో చింత పండు పరిశ్రమలో సుమారు 15 వేల మంది పనిచేస్తుండగా వారిలో సుమారు 10 వేల మంది మహిళలు ఉన్నారు. చింతపండు తయారీని కుటీర పరిశ్రమగా మార్చుకుని జీవనం సాగిస్తున్నా రు. ధరలు, ఎగుమతులు లేకపోవడంతో స్థానిక ఉన్న 9 కోల్డ్‌స్టోరేజీలలో సుమారు 2 వేల లోడ్ల చింత పండు మగ్గిపోతుండడంతో చింతపండు వ్యాపారులకు తీవ్ర నిరాశమిగులుతోంది. దీని కారణంగా వ్యాపారులు, రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. చింతపండును గిట్టుబాటు ధరలతో ప్రభుత్వం కొనుగో లు చేయాలని రైతులు, వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే చింతపండు వ్యాపారం కుదేలవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోల్డ్ స్టోరేజ్‌ల్లో చింత నిల్వలు

పుంగనూరు పట్టణం సమీపంలోని ఎంబీటీ రోడ్డులో శ్రీనివాస, మురుగన్, కేఎస్ఎం, కృష్ణా, ఎంకేబీ, వెంకటేశ్వర, హిమాలయ, ఎస్ఏబీ, బాలాజీ కోల్డ్ స్టోరేజ్ లున్నాయి. వీటిల్లో సుమారు 2 వేల లోడ్ల చింత పండు నిల్వ ఉన్నట్లు సమాచారం.

చింత తీరకపోతోంది

ఏ ఏటా కొనుగోలు చేసిన చింతపండును ఆ ఏడాది విక్రయిస్తారు. లేకపోతే చింతపండు రంగుమారి, ధరలు పడిపోతుంది. గత ఏడాది ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో చింతపండు వ్యాపారం కుప్పకూలిపోయింది. పుంగనూరులో వేలాది లారీల సరుకు నిల్వ ఉండిపోయింది. ఇది ఇలాఉండగా కొత్తగా పంట రావడంతో మరో మూడు వేల లారీల సరుకు ఏప్రిల్ నెలలోపు గోడౌన్లకు చేరనున్నది. గత ఏడాది సరుకు విక్రయాలు కాకపోవడంతో రైతులు, వ్యాపారులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. చింతపండును ప్రభుత్వం కొనుగోలు చేసి, వ్యాపారులను, రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

చింతపండు ధరలిలా..

ప్రస్తుతం చింతపండు ధరలు ఇలా ఉన్నాయి. 10 టన్నుల కట్టికాయ ధర రూ.3.50 లక్షలు ఉంది. అలాగే సుమారు రూ.10 లక్షల విలువైన 10 టన్నులు చింత పండు ఉంది. కట్టికాయ కిలో రూ.35, చపాతి ఒకటి ధర రూ.80 నుంచి రూ.100 వరకు, ఫ్లవర్ రూ.80 నుంచి రూ.100, కరిపులి కిలో రూ.100 నుంచి రూ.130 వరకు పలుకుతున్నాయి.

చింతపండు తయారీ ఇలా..

పుంగనూరులో చింతచెట్లు అధికంగా ఉండడంతో జనవరి నుంచి మార్చి నెలాఖరు వరకు చెట్లలో ఉన్న కాయలు రాల్చడం, వాటిని ఒబ్బిడి చేసి, కట్టికాయగా మార్చడంలో పురుషులు, స్త్రీలు ఎక్కువగా భాగస్వాములవుతారు. వ్యాపారులు పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో మండీలు ఏర్పాటు చేసి, చింతకాయను కొట్టించి, ఒబ్బిడి చేసి కోల్డ్‌స్టోరేజీలలో నిల్వ చేస్తున్నారు.

దిగుమతి

చింతపండును స్థానికంగా కొనుగోలు చేయడంతో పా టు కర్ణాటక రాష్ట్రంలోని గుండల్‌పేట, మాండ్యా, చింతామణి, శ్రీనివాసపురం, సిరా, టుంకూరు, చెల్లకిరి, మహారాష్ట్రలోని ఔరంగాబాద్, నిజామాబాద్, బిహార్ లోని రాంచి, జగదల్‌పూర్, రాయపూర్, తదితర ప్రాంతాల నుంచి సుమారు 30 వేల టన్నుల చింతకాయ(కట్టికాయ) దిగుమతి చేసుకుంటారు. వాటిని ప్రజల ఇళ్లకు తరలించి, పండుగా, చపాతీగా, ఫ్లవర్‌గా, కరిపులిగా తయారు చేయిస్తారు.

వ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలి



చింతపండు వ్యాపారులను ప్రభుత్వం తక్షణమే ఆదు కోవాలి. ధరలు లేకపోవడం, చింతపండు నిల్వలు పెరి గిపోయాయి. పుంగనూరులో 15 వేల కుటుంబాలు చింతపండుపై ఆధారపడి జీవిస్తున్నాయి. ప్రభుత్వం చింతపండును గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేసి, అందరినీ ఆ దుకోవాలి. అలాగే రాయితీలు ప్రకటించాలి. చింతపండు కార్మికులు, రైతులు, వ్యాపారులకు ఆరోగ్యబీమాతో పాటు విరివిగా వడ్డీలేని రుణాలు ఇచ్చి ఆదుకోవాలి. - **ఎంఎస్.సలీంబాషా, చింతపండు వ్యాపారుల సంఘం అధ్యక్షుడు, పుంగనూరు**

వ్యాపారం చేయలేకపోతున్నాం



చింతపండుకు గిట్టుబాటు ధర లేకపోవడంతో చింతపండు ఏసీ గోడౌన్లలో మగ్గిపోతోంది. దీంతో వ్యాపారం చేయలేకపోతున్నాం. ఈ ఏడాది తిరిగి పంట భారీ స్థాయిలో వస్తోంది. ఈ తరుణంలో సరుకు కొనలేక, ఏసీ గోడౌన్లకు అద్దె చెల్లించలేక, పెట్టుబడికి వడ్డీలు కట్టలేక, కూలీలు ఇవ్వలేకపోతున్నాం. చివరకు అప్పులు మిగులుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో చింతపండు వ్యాపారం కన్నీరు తెప్పిస్తోంది. కుటుంబాలను వీధినపడేస్తోంది. విధిలేక తరతరలుగా వస్తున్న వ్యాపారాన్ని చేస్తున్నాం. ప్రభుత్వం వ్యాపారులు, రైతులను ఆదుకోవాలి. - **ఎస్.హఫీజ్‌ఖాన్, చింతపండు వ్యాపారుల సంఘం కార్యదర్శి, పుంగనూరు**

పన్ను మినహాయింపు

చింతపండు ధరలు లేని సమయంలో చింతపండు వ్యాపారులు రైతులపై సేల్‌ట్యాక్స్ అధికారుల దాడులు తీవ్రమయ్యాయి. 2018 సంవత్సరంలో సేల్‌ట్యాక్స్ అధికారులు దాడులు చేసి రూ.లక్షల మేరకు పన్నులు విధించి, స్టాక్ సీజ్ చేశారు. దీనిపై ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి స్పందించారు. సొంత నియోజకవర్గంలో వ్యాపారుల వేధింపులపై ఆందోళన చెందారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే చింతపండుకు జీఎస్టీ రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి చింతపండుకు పన్ను మినహాయించాలని కేంద్రానికి లేఖ రాశారు. దీనిపై ఎంపీ మిథున్‌రెడ్డి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో పలుమార్లు చర్చలు జరిపారు. చింతపండుకు పన్ను మినహాయింపు తీసుకొచ్చారు. ఇది వ్యాపారులకు ఎంతో ఊరటనిచ్చింది.

ఎగుమతి

చింతపండును తయారు చేసి, వాటి రంగు మారకుండా ఉండేందుకు, ధరలు కోల్పోకుండా ఉండేందుకు పండును ఏసీ గోడౌన్లలో నిల్వ చేస్తారు. ధరల ఆధారంగా విక్రయాలు చేస్తారు. ఇలా తయారు చేసిన పండును మద్రాసు, చెన్నై, ప్రొద్దుటూరు, విజయవాడ, హైదరాబాద్, హిందూపూర్, కడప, మంగళూరుకు తరలిస్తారు. జూన్ నుంచి అమ్మకాలకు సిద్ధం చేస్తారు. ఇందుకుగాను కూలీలకు ఒక్కొక్క చపాతీ తయారు చేసేందుకు రూ.10 కూలి ఇస్తారు. అలాగే 20 కిలోల ఫ్లవర్ పండు బ్యాగ్‌లు, అర్ధ కిలో బిస్కెట్ ప్యాకెట్లు తయారీ చేస్తారు. వర్షా కాలం మినహా మిగిలిన అన్ని రోజుల్లోను చింత పండు తయారు చేస్తారు. ఏడాదిలో 9 నెలలు చింతపండు పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తారు.



చపాతీలుగా చేసిన చింతపండు ప్యాకెట్లు

వెట్టి చాకిరీ విముక్తికి సమష్టి కృషి అవసరం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జడ్జి, అధికారులు

చిత్తూరు అర్బన్: వెట్టి చాకిరీ పనులు చేస్తున్న వారికి విముక్తి కల్పించడానికి సమష్టి కృషి అవసరమని చిత్తూరు తొమ్మిదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం.శ్రీనివాస రావు అన్నారు. శుక్రవారం చిత్తూరు న్యాయస్థానాల సముదాయ ప్రాంగణంలోని జిల్లా న్యాయసేవా సదన్ భవనంలో రోప్, ఐజేఎం సంస్థలు, ప్రభుత్వ అధికారులతో కలిసి వెట్టి చాకిరీ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ వెట్టి చాకిరీ వ్యవస్థ సమాజానికి చేటన్నారు. అనంతరం అధికారులతో కలిసి వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి మూర్తి, కార్మిక శాఖ అధికారి ఓంకార్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చెన్నయ్య, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి చంద్రశేఖర్, సర్వశిక్షా అభియాన్ పీఓ వెంకటరమణ రోప్స్ సంస్థ చైర్మన్ ధనశేఖరన్, ఐజేఎం నిర్వాహకులు ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు టీచర్లకు చార్జి మెమోలు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని కట్టమంచి నగర పాలక పాఠశాలలోని ముగ్గురు టీచర్లకు చార్జి మెమోలు శుక్రవారం డీఈఓ వరలక్ష్మి జారీ చేశారు. ఆ పాఠశాలలోని సోషల్ టీచర్ ధనశేఖర్ విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన ఇటీవల బయటపడిన విషయం విదితమే. ఈ ఘటనలో ఇది వరకే సోషల్ టీచర్‌ను సస్పెండ్ చేశారు. అయితే ఈ ఘటనపై మరింత లోతుగా విద్యాశాఖ అధికారులు విచారణ జరిపారు. తాజాగా ఆ పాఠశాలలోని పీడీ భువనేశ్వరి, హిందీ టీచర్ జ్యోతిశ్వరి, గణిత టీచర్ మనోహర్‌కు చార్జి మెమోలను డీఈఓ జారీ చేశారు. ఈ చార్జి మెమోలపై ముగ్గురు టీచర్లు ఇచ్చే సమాధానం ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

కదనబరి.. రూ.కోట్లే గురి

రాష్ట్రవ్యాప్తంగా జల్లికట్టు నిషేధం.. ఆ ఆంక్షలు అటకెక్కాయి..పౌరుషం రంకెలేస్తోంది..నోట్ల కట్టలు నోళ్లు తెరిచి విస్తుపోయిన వేళ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన కుప్పం నియోజకవర్గంలో కూటమి అండతో జల్లికట్టు యథేచ్ఛగా సాగుతోంది. విజేత వృషభాలకు బహుమతులతోపాటు అధిక ధరలు.. నిర్వాహకులకు కాసుల వర్షం కురుస్తోంది.



ఐరాల మండలం వీఎస్ అగ్రహారంలో నిర్వహించిన జల్లికట్టు (ఫైల్)

కూటమి అండతో యథేచ్ఛగా జల్లికట్టు

- ఒక్కొక్క ఎద్దుకు రూ.4 వేలు డిపాజిట్
- 60 బహుమతులు
- ఏమి జరిగినా సంబంధం లేదంటున్న గ్రామస్తులు
- 8 మందిపై బైండోవర్ కేసులు
- నేడు బోయనపల్లెలో జల్లికట్టు నిర్వహణ

గుడుపల్లె: మండలంలోని బోయనపల్లెలో శనివారం జరగనున్న జల్లికట్టు టీడీపీ నేతలకు కాసుల వర్షం కురిపించనుంది. జల్లికట్టు నిషేధమని, నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకోనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ కూటమి నాయకులు యథేచ్ఛగా జల్లికట్టు నిర్వహించడానికి సమాయత్తం అవుతున్నారు. కుప్పం ప్రాంతం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు కావడం, జల్లికట్టు నిషేధించడంతో సరిహద్దుల్లోని గ్రామాల్లో కూటమి నేతలకు ఇది వ్యాపారంగా మారింది. జల్లికట్టు అనే విషయం తెలియగానే వేల సంఖ్యలో జనం వస్తున్నారు. దీనితోపాటు టెంపోల్లో ఎద్దులను తీసుకువచ్చి జల్లికట్టులో దింపి, బహుమతి పొందిన ఎద్దులను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇలా కుప్పం ప్రాంతంలోని సరిహద్దు గ్రామాల్లో జల్లికట్టు నిర్వహణతో సిరుల పంట పండిస్తున్నారు నిర్వాహకులు. బోయనపల్లె గ్రామం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో ఉండడంతో జల్లికట్టుకు భారీగా జనం, ఎద్దులు రానున్నాయి. జల్లికట్టులో మొదటి బహుమతి రూ. 1.75 లక్షలతోపాటు ద్విచక్ర వాహనం, రెండో బహుమతి రూ.1.40 లక్షలతోపాటు ద్విచక్ర వాహనం, మూడో బహుమతి రూ. లక్షతోపాటు ద్విచక్రవాహనం ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. అలాగే రూ.40 వేలు నుంచి రూ.3 వేల వరకు రూ.60 బహుమతులు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. జల్లికట్టులో ఎద్దును ఒకసారి వదిలేందుకు దాని యజమాని రూ.4 వేలు చెల్లించాలన్నారు. ఎంట్రీ ఫీజు చెల్లించిన వారు ఎద్దును వదలడానికి ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జల్లికట్టు నిర్వహిస్తున్నామన్నారు.

జల్లికట్టు నిర్వహిస్తే కేసులు నమోదు

బోయనపల్లెలో జల్లికట్టు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తాం. రెండు రోజుల ముందు బోయనపల్లెలో జల్లికట్టు నిర్వహిస్తారని కరపత్రాలు అందాయి. ఆ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టాం. జల్లికట్టు నిర్వస్తామని తెలిపిన 8 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశాం. నిబంధనలు అతిక్రమించి జల్లికట్టు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తాం.

– శ్రీనివాసులు, ఎస్ఐ, గుడుపల్లె

ప్రాణనష్టంతో మాకు సంబంధం లేదు

జల్లికట్టుకు వచ్చే తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రలకు సంబంధించిన ప్రజలు, ఎద్దులకు, ప్రాణనష్టం, గాయాలు ఇంకేమైనా జరిగితే తమకు ఎలాంటి సంబంధం లేదని బోయనపల్లె గ్రామస్తులు కరపత్రాల్లోనే ముద్రించారు. ప్రతి ఎద్దుకూ ఒకసారికి రూ.4 వేలు చెల్లిస్తే, దానికి తగ్గట్టు బహుమతులు ఇస్తామని, కానీ నష్టపరిహారం ఇవ్వలేమని నిర్వాహకులు చెబుతున్నారు.



జల్లికట్టు నిర్వహణకు కూటమి నేతల ఫొటోలతో ముద్రించిన కరపత్రం

చింటూకు బెయిల్..!

- చిత్తూరు మాజీ మేయర్ దంపతుల కేసులో నిందితుడికి ఊరట
- తొమ్మిదేళ్లకు పైగా జైల్లో అండర్ ట్రయల్ ఖైదీగా చింటూ
- షరతులతో బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు



చింటూ (ఫైల్)

చిత్తూరు అర్బన్: చిత్తూరు మాజీ మేయర్ కటారి అనురాధ, ఆమె భర్త జంట హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న చింటూ అలియాస్ శ్రీరామ్ చంద్రశేఖర్‌కు బెయిల్ మంజూరైంది. జంట హత్యల తరువాత తొమ్మిదేళ్లకు పైగా జైల్లో ఉన్న చింటూకు రాష్ట్ర హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయనకు భారీ ఊరట లభించినట్లయ్యింది.

కేసు వివరాలివీ..

చిత్తూరు మాజీ మేయర్ అనురాధ, ఆమె భర్త కటారి మోహన్ 2015, నవంబరు 17వ తేదీన చిత్తూరు నగరంలోని మున్సిపల్ కార్యాలయంలో ఉన్నారు. ముసుగులు (బుర్కా) ధరించి వచ్చిన ఓ వ్యక్తితో పాటు మరి కొందరు తుపాకులు, కత్తులతో ఛాంబర్‌లోకి చొరబడ్డారు. మేయర్ అనురాధను తుపాకీతో కాల్చి చంపగా.. ఆమె భర్త మోహన్‌ను కార్యాలయంలో వేటాడి కత్తులతో నరికి హతమార్చారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా పోలీసుశాఖ వైఫల్యానికి అద్దం పట్టే ఈ ఘటన అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ నేరంలో మోహన్ మేనల్లుడు చింటూ అలియాస్ చంద్రశేఖర్ ప్రధాన నిందితుడిగా హత్యలో పాల్గొని, కుట్రతో పాలు పంచుకున్నట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. 2015 నవంబరు 30వ తేదీ చింటూ చిత్తూరు కోర్టులో లొంగిపోయాడు. మొత్తం 23 మందిని పోలీసులు నిందితులుగా చూపారు. వీరిలో ఒకరికి ఈ హత్య కేసులో సంబంధం లేదని న్యాయస్థానం తీర్పునిచ్చింది. అప్పటి నుంచి ఈ కేసు విచారణ కొనసాగుతోంది. కాగా 2007 డిసెంబరు 31న చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబుపై జరిగిన హత్యాయత్నం కేసులో చింటూకు చిత్తూరులోని జిల్లా కోర్టు 2018 మార్చిలో జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చింది. దీనిపై నిందితుడు కోర్టును ఆశ్రయించడంతో గతేడాది ఈ కేసును కొట్టేస్తూ రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చింది.

షరతులతో బెయిల్..

తాను ఇప్పటివరకు ఆరుసార్లు బెయిల్ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు, దాదాపు తొమ్మిదేళ్లకు పైగా జైల్లో ఉన్నానని.. తనకు జీవించే హక్కు కల్పిస్తూ బెయిల్ మంజూరు చేయాలంటూ చింటూ తన న్యాయవాది ద్వారా ఏడో సారి హైకోర్టును ఆశ్రయించాడు. అయితే చింటూకు బెయిల్ ఇస్తే జంట హత్య కేసులో సాక్ష్యులను ప్రభావితం చేసే అవకాశం ఉందని, బెదిరింపులకు గురిచేసే అవకాశం కూడా లేకపోలేదంటూ ప్రాసిక్యూషన్ వాదనలు వినిపించారు. పిటిషనర్ వాదనతో ఏకీభవించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి.. చింటూకు షరతులతో బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. రూ.లక్ష విలువైన బాండ్లను సమర్పించి, ఇద్దరు వ్యక్తులు ష్యూరిటీలను చిత్తూరు జిల్లా కోర్టు ఎదుట హాజరుపరచాలని పేర్కొన్నారు. చింటూ ఎట్టి పరిస్థితిల్లోనూ చిత్తూరు నగరంలోకి ప్రవేశించకూడదని, మాజీ మేయర్ దంపతుల హత్య కేసులో తుది తీర్పు వచ్చేంత వరకు ఈ షరతు వర్తిస్తుందన్నారు. జంట హత్య కేసు విచారణ సమయంలో మాత్రమే చింటూ చిత్తూరు కోర్టు ఎదుట హాజరు కావాలని తీర్పులో తెలిపారు. చింటూ ఫోన్ నంబర్, లొకేషన్లకు తిరుపతి, చిత్తూరు ఎస్పీలకు అందజేయాలన్నారు. కాగా కోర్టు ఆదేశాలతో చింటూ చిత్తూరులో ఉండకుండా, జంట హత్యల కేసు ముగిసేంత వరకు తిరుపతిలో నివశించే అవకాశం ఉంది. వచ్చేవారం చింటూ చిత్తూరు జిల్లా జైలు నుంచి విడుదలయ్యే అవకాశాలున్నాయి.

పెద్దిరెడ్డిని రాజకీయంగా అణచివేసేందుకు కుట్ర

- బురదజల్లేందుకు తప్పుడు కథనాలు
- ఎలాంటి మచ్చలేని నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- పచ్చపత్రిక కథనాలపై భూమన ఆగ్రహం



భూమన కరుణాకర రెడ్డి

తిరుపతి మంగళం : రాష్ట్రంలో కీలకంగా వ్యవహరిస్తున్న మా నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రాజకీయంగా అణచివేయాలన్న కుట్రలు, కుతంత్రాలతో లేనిపోని తప్పుడు కథనాలను తన ఎల్లో మీడియాలో వండి వారుస్తున్న నీచులు చంద్రబాబు, లోకేష్ అని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. పెద్దిరెడ్డిపై ఈనాడు పత్రిక రాస్తున్న తప్పుడు కథనాలను ఆయన ఖండించారు. ఈ మేరకు శుక్రవారం ఒక వీడియోను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ కీలకనేతలపై అక్రమ కేసులు పెట్టడం, దాడులు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇందులో భాగంగానే వైఎస్సార్‌సీపీలో సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని చంద్రబాబు, లోకేష్ టార్గెట్ చేశారన్నారు. ఆయన్ను ఇబ్బందులకు గురిచేయాలన్న దురాలోచనతో అటవీ భూములు ఆక్రమించారంటూ ఎల్లో మీడియాలో తప్పుడు కథనాలు రాయించడం వారి దుర్మార్గానికి నిదర్శనమన్నారు. పెద్దిరెడ్డిపై బురదజల్లేందుకు 22.5 ఎకరాల అటవీ భూమి ఆక్రమించారని ఈనాడు పత్రికలో రాయడం వెనుక చంద్రబాబు, లోకేష్ ఉన్నారన్నారు. పెద్దిరెడ్డి ఎలాంటి భూ ఆక్రమణలకు పాల్పడలేదని అటు రెవెన్యూ, ఇటు అటవీశాఖ అధికారులు సర్వే చేసి చెప్పారన్నారు. అయినా సరే ఈనాడు దినపత్రిక శుక్రవారం మళ్లీ తమ పార్టీ కీలక నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మీద అక్షరాల వాంతి చేసుకుందన్నారు. నిరంతరం ఆయన మీద పడి ఏడుస్తూ ఉండడం ఈనాడుకు అలవాటుగా మారిందని మండిపడ్డారు. మదనపల్లె ఆర్డీఓ కార్యాలయంలో పెద్దిరెడ్డి పీఏ తుకారాం, మాధవరెడ్డి దీనికి సంబంధించిన ఫైళ్లను ఆధారాలు లేకుండా చేశారని, దీనికి ఆర్డీఓ మురళి సహకరించారని గతంలోనూ ప్రచురించిందని, మళ్లీ ఇప్పుడు అదే అసత్య వార్తను ప్రచురించడంపై ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇందులో విచారణ నివేదిక సమర్పించారని చెబుతూనే అమెరికాలో ఉన్నటువంటి తుకారాంను పిలిపించలేదని, మదనపల్లెలో ఉన్న మాధవరెడ్డిని విచారణ చేయలేదని రాసిందన్నారు. అయితే అధికారంలో ఉండి ఎందుకు విచారించలేదని ప్రశ్నించారు. పచ్చి అబద్ధాలతో కూడిన వార్తలు రాయడంలో ఈనాడు పత్రిక దేశంలోనే ఉన్నతమైన స్థానంలో ఉందన్నారు. సాక్షాత్తు డీజీపీనే అక్కడకు పంపి విచారణ చేయమని చెప్పిన ఆ విచారణ ఏమైందన్న విషయాన్ని కూడా చంద్రబాబు బయట పెట్టలేదన్నారు. పెద్దిరెడ్డిపై బురదచల్లే కార్యక్రమం తప్ప నిజంగా అక్కడ ఏ అవినీతికి ఆస్కారం లేదన్నారు. మీరు ఎన్నిరకాల కుట్రలు చేసినా కడిగిన ముత్యం పెద్దిరెడ్డి అన్న విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు.

ప్రధాని ప్రసంగ వీక్షణకు ఏర్పాట్లు చేయాలి

చిత్తూరు కార్పొరేషన్: విద్యార్థులకు వార్షిక పరీక్షల నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ ఫిబ్రవరి 10న పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేలా పాఠశాలల్లో ఏర్పాట్లు చేయాలని డీఈఓ వరలక్ష్మిని బీజేపీ సీనియర్ నాయకుడు చిట్టిబాబు కోరారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓకు వినతిపత్రం అందజేశారు. దూరదర్శన్ ఛానల్‌తో సామాజిక మాధ్యమాల్లో 10వ తేదీన ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రసారమవుతుందన్నారు. ఈ మేరకు పాఠశాలల్లో ప్రసారం ఏర్పాట్లు చేసేలా అధికారులకు ఆదేశాలివ్వాలని వినతిలో వివరించారు.

గొనిచెరువులో వ్యక్తి గల్లంతు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి గొనిచెరువులో శుక్రవారం సాయంత్రం ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. మొగిలిలోని ఓ కంపెనీలో పనిచేస్తున్న తమిళనాడుకు చెందిన నలుగురు వ్యక్తులు ఫ్యాక్టరీ సమీపంలోని గొనిచెరువుకు వెళ్లినట్లు సమాచారం. అందులో ఓ వ్యక్తి చెరువులో మునిగి గల్లంతయ్యాడు. ఫ్యాక్టరీ సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. మొగిలి గొనిచెరువు వద్దకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి కావడంతో గల్లంతైన వ్యక్తి ఆచూకీ తెలుసుకునేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

క్లుప్తంగా

స్టోర్స్ డీఈగా వసంతనాయుడు



చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లా ట్రాన్స్‌కో స్టోర్స్ డీఈగా వసంతనాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డీఈ బాలాజీకి ఈఈగా ఉద్యోగోన్నతి రావడంతో కార్పొరేట్ కార్యాలయ క్వాలిటీ కంట్రోల్ విభాగానికి మారారు. ఆయన స్థానంలో పీఅండ్ఎంఎం విభాగ డీఈగా ఉన్న వసంతనాయుడిని బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

పుంగనూరు: పట్టణంలోని బస్టాండ్ నడిబొడ్డున ఉన్న కౌండిన్య నది కాలువలో ఆక్రమణలను శుక్రవారం సాయంత్రం మున్సిపల్ అధికారులు తొలగించారు. కాలువ స్థలంలో మూడు రూములను తెలుగుదేశం పార్టీకి చెందిన చోటా నాయకుడి అండతో వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై విమర్శలు రావడంతో జిల్లా కలెక్టర్ స్పందించారు. మున్సిపల్ కమిషనర్ మధు సూదన్ రెడ్డి, తహసీల్దార్ రాము, సీఐ శ్రీనివాసులు కలసి ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. ఈ మేరకు అధికారులు జేసీబీతో ఆక్రమణలను తొలగించి, కాలువ స్థలం దురాక్రమణ కాకుండ కాపాడారు. ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ టీపీఓ జగదీశ్వర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునివెంకటప్ప, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

కోనాపల్లి సచివాలయం తనిఖీ



తనిఖీ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

యాదమరి(కాణిపాకం): యాదమరి మండలంలోని కోనాపల్లి సచివాలయాన్ని శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. బీసీ కార్పొరేషన్ రుణాలకు ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారన్న విషయంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తు పొడిగింపు తేదీని గుర్తు చేశారు. ఆసక్తి ఉన్న వారిని ఈనెల 12వ తేదీ లోపు దరఖాస్తు చేసుకునేలా గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

చెరువులో పడి విద్యార్థి మృతి



వినయ్ (ఫైల్)

బైరెడ్డిపల్లె: మండలంలోని రామనపల్లె సమీపంలో ఉన్న చెరువులో పడి ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. రామనపల్లెకు చెందిన సుధాకర్ కుమారుడు వినయ్(8) అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. పాఠశాల ముగిసిన తరువాత స్నేహితునితో కలిసి గ్రామ సమీపంలోని చెరువులో బహిర్భూమికి వెళ్లాడు. చెరువులో ఇటీవల రైతులు జేసీబీతో తవ్విన గుంతలో నీరు లోతుగా ఉండడంతో అందులోకి దిగి మునిగిపోయాడు. వినయ్ స్నేహితులు కేకలు పెడుతూ గ్రామంలోకి వచ్చి, గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు అక్కడికి చేరుకుని, వెలికితీసే లోపే మృతి చెందాడు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కార్వేటినగరం: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని తెల్లగుంట సమీపంలో చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సుమారు 40–42 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి తెల్లగుంట సమీపంలోని చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై ఓ చెట్టు నీడన అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి, 108 వాహనానికి సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న సిబ్బంది పరిశీలించి, అతను అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అనంతరం వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆచూకీ కోసం అతడి వద్ద ఉన్న లగేజీ బ్యాగ్‌ను పరిశీలించారు. అందులో సుత్తి, కటింగ్ బ్లేడ్ ఉన్నట్లు గుర్తించారు. అయితే అతని వివరాలు లభించక పోవడంతో మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడు తెలుపు, బ్లూకలర్ చెక్ షర్టు, గళ్ల లుంగీ, బ్లూ డ్రాయర్ ధరించి ఉన్నాడని, ఆ చూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం తెలపాలని పోలీసులు పేర్కొన్నారు.

వ్యక్తిపై కారంపొడి చల్లి హత్యాయత్నం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో మాధవన్ అనే వ్యక్తిపై శుక్రవారం రాత్రి హత్యాయత్నం జరిగింది. సంతపేటకు చెందిన మాధవన్ ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నారు. రాత్రి ఇంటికి వెళుతుండగా తేనెబండ విజయలక్ష్మి కాలనీ దారిలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మాధవన్ బండి ఆపారు. వెంటనే కంట్లో కారంపొడి చల్లి కత్తులతో హత్య చేయడానికి ప్రయత్నించారు. కత్తిపోట్లకు గురైన బాధితుడిని స్థానికులు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. టూ టౌన్ సీఐ నెట్టికంటయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోబోల్తా.. ఇద్దరికి తీవ్ర గాయాలు





గాయపడిన భానుప్రియ, అఖిల్

చౌడేపల్లె: చౌడేపల్లె– పలమనేరు మార్గంలోని చారాల సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గుర్రంకొండ మండలం తరిగొండకు చెందిన మనోహర్ కుటుంబ సభ్యులతో కలిసి బంగారుపాళెంలోని బంధువుల ఇంటికి ఆటోలో వెళ్లారు. అదే ఆటోలో తిరిగి స్వగ్రామానికి వస్తుండగా చారాల వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో భానుప్రియ(10), అఖిల్(8)కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సిబ్బంది గణేష్, ప్రసాద్ మదపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంపద కేంద్రాల రాబడితో గ్రామాభివృద్ధి సాధ్యం



పారిశుద్ధ్య సిబ్బందికి యూనిఫామ్ అందజేస్తున్న జెడ్పీ సీఈఓ, డీపీఓ, సర్పంచ్

ఐరాల: చెత్త సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు వచ్చే ఆదాయంతో గ్రామాభివృద్ధి సాధ్యమని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు, డీపీఓ సుధాకర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కాణిపాకం చెత్త సంపద కేంద్రాన్ని సీఈఓ, డీపీఓ స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డులో వర్మీ కంపోస్టు తయారీ, ప్లాస్టిక్ కటింగ్ మెటీరియల్, వర్మీ కంపోస్టు విక్రయ కౌంటర్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఈఓ, డీపీఓ మాట్లాడుతూ కాణిపాకం పంచాయతీ చెత్త సంపద కేంద్రాన్ని ఆదర్శంగా తీసుకుని మిగిలిన పంచాయతీల్లోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను ఇలాగే తయారు చేయాలని ఈఓపీఆర్డీ కుసుమకుమారిని ఆదేశించారు. చెత్త సేకరణ, వర్మీ కంపోస్టు తయారీతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య పరిష్కారం కావడంతోపాటు పంచాయతీలకు ఆదాయం వస్తుందన్నారు. షెడ్డుకు త్వరితగతిన ప్రహరీగోడ నిర్మాణం చేపట్టాలని సర్పంచ్‌ను కోరారు. అనంతరం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫామ్, చెప్పులు, సబ్బులు, కొబ్బరి నూనె పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ విశ్వనాథరెడ్డి, వార్డు సభ్యులు సౌందర్‌రాజన్, వేణుగోపాల్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణదేవరాయల విగ్రహంపై వివాదం



వైఎస్సార్‌సీపీ నేతలు ప్రతిష్ఠించిన కృష్ణదేవరాయుల విగ్రహం వద్ద కాపు నేతలు

చిత్తూరు అర్బన్: నగరంలోని గంగినేనిచెరువు కట్టపై ఉన్న మున్సిపల్ పార్కులో శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం మూలన పడేయడంపై శుక్రవారం వివాదం నెలకొంది. పార్కులో ఓ మూలన కృష్ణదేవరాయల విగ్రహం పడిపోయి ఉండటాన్ని కొందరు ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. దీనిపై కాపు సామాజికవర్గ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులపై మండిపడుతూ పోస్టులు పెట్టారు. ఉరుకులు పరుగులతో వెళ్లిన అధికారులు పార్కులో చూసేసరికి.. విగ్రహం యథావిధిగా కనిపించింది. దీంతో పార్కు మొత్తం జల్లెడ పట్టగా.. గతేడాది వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంత్రి హోదాలో ఉన్నప్పుడు ప్రారంభించిన విగ్రహం యథాస్థితిలో ఉన్నట్లు గుర్తించారు. అయితే ఓ విగ్రహం మాత్రం చాలా రోజులుగా చెట్ల మధ్య ఉండిపోవడంతో, దాన్ని బయటకు తీసిన కార్పొరేషన్ అధికారులు శుభ్రం చేయించి భద్రపరచినట్లు ప్రకటించారు. దీంతో వివాదానికి తెరపడింది.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

–50 గ్రామల బంగారం స్వాధీనం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు రైల్వేస్టేషన్‌లో మహారాష్ట్రకు చెందిన అంతర్రాష్ట్ర దొంగ ప్రకాష్‌ను అరెస్టు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. తిరుపతి రైల్వే డీఎస్పీ హర్షిత, సీఐ యతేంద్రలు ఇచ్చిన సమాచారం మేరకు నిందితుడిని పట్టుకున్నమన్నారు. అతని వద్ద నుంచి మొత్తం 50 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నమని చెప్పారు. గురువారం సాయంత్రం స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం–2లో తనిఖీ చేస్తుండగా అనుమానంగా సంచరిస్తున్న వ్యక్తిని ప్రశ్నించామన్నారు. ఆ సమయంలో అతను పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకుని విచారించామన్నారు. మహారాష్ట్ర బీడ్ జిల్లాకు చెందిన ప్రకాష్‌పై ఆ రాష్ట్రంలో 11 కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల్లో దొంగతనాలు చేస్తున్నట్లు అంగీకరించాడన్నారు. అతని వద్ద నుంచి 14 గ్రాముల చేతిగాజులు, 36 గ్రాముల గల ఒక హనుమాన్ డాలర్, రెండు గొలుసులు సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో జీఆర్‌పీఎఫ్, ఆర్పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.